క్లుప్తంగా

రైల్వేల భద్రతకు సహకరించాలి



సామర్లకోట వెయిటింగ్ హాల్‌లో ప్రయాణికులతో మాట్లాడుతున్న రైల్వే ఎస్సై

సామర్లకోట: రైల్వే భద్రతకు ప్రయాణికులు సహకరించాలని జీఆర్పీ ఎస్సై బి.లోవరాజు అన్నారు. శనివారం స్థానిక రైల్వే వెయిటింగ్ హాళ్లలో వేచి ఉన్న ప్రయాణికులతో రైళ్లలో జరిగే నేరాలపై అవగాహన కల్పించారు. అవాంఛనీయ సంఘటనలపై అప్రమత్తంగా ఉండాలని లోవరాజు అన్నారు. రైల్వే ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్, రాజమహేంద్రవరం డీఎస్పీ సూచనల మేరకు ఆయన సమావేశం నిర్వహించారు. రైళ్లపై రాళ్లు రువ్వడం, రైళ్లలో గంజాయి, మద్యం వంటి నిషేధిత వస్తువులు తీసుకుని వెళ్తున్న సంఘటనలు గుర్తిస్తే వెంటనే ఆయా రైల్వే స్టేషన్ల పరిధిలో సమాచారం ఇవ్వాలన్నారు.

మేకపై గుర్తు తెలియని జంతువు దాడి

పెద్దాపురం: మండలంలోని కాండ్రకోటలో క్షుద్ర పూజల వదంతులు వ్యాపిస్తున్న నేపథ్యంలో శనివారం అర్ధరాత్రి ఓ ఇంట్లో మేకపై గుర్తు తెలియని జంతువు దాడి చేయడంతో అది మృతి చెందింది. స్థానిక పీహెచ్‌సీ సమీపంలో నివాసం ఉంటున్న షేక్ బాషాకు చెందిన మేకను ఉదయం తెల్లారేసరికి ఆ జంతువు తినేసినట్టు ఉండడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

రేపు భారీ అన్నదానం

పెద్దాపురం: మండలంలోని పులిమేరు సంపత్ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం సందర్భంగా మహాన్నదానం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బండారు నాగబాబు, శ్వేత తెలిపారు. శనివారం వారు స్థానిక విలేకర్లకు ఓ ప్రకటన విడుదల చేస్తూ ఉదయం 11 గంటల నుంచి ఆలయం కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించాలని వారు కోరారు.

గుండెపోటుతో మాజీ కౌన్సిలర్ మృతి



పాడుగు చిట్టిబాబు (ఫైల్)

సామర్లకోట: మాజీ కౌన్సిలర్ పాడుగు చిట్టిబాబు (49) గుండె పోటుతో శనివారం మృతి చెందాడు. గత ఏడాది ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ఆయన కుమార్తె మంచి ర్యాంకు సాధించడంతో శనివారం మధ్యాహ్నం సన్నిహితులకు విందు ఏర్పాటు చేశారు. భోజనాలు చేస్తుండగానే గుండె నెప్పి రావడంతో కుటుంబ సభ్యులు మెహర్ కాంప్లెక్స్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకు వెళ్లారు. అక్కడ వైద్యుడు లేక పోవడంతో ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్తుండగా మార్గం మధ్యలో అయన మృతి చెందాడు. చిట్టిబాబుకు భార్య, పీజీ చేస్తున్న కుమారుడు, బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న కుమార్తె ఉన్నారు. మరణ వార్త తెలిసి మాజీ కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ నాయకుడు మన్యం చంద్రరావు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది మృతదేహం వద్దకు చేరుకుని సంతాపం తెలిపారు. మున్సిపల్ కమిషనర్ జె.రామారావు కోర్టు పనిపై విజయవాడ వెళ్లి ఫోన్‌లో కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన మృతితో బ్రౌన్‌పేటలో విషాదం నెలకొంది.

ఆక్రమణల పరిశీలన

పిఠాపురం: పిఠాపురంలో పంచమాధవ క్షేత్రమైన కుంతీ మాధవస్వామి ఆలయం ఉత్తర గోపురం వద్ద ఆక్రమణలను శనివారం మున్సిపల్ అధికారులు పరిశీలించారు. ఉత్తర ద్వారం వైపు ఉన్న ఆలయ స్థలం ఆక్రమణలకు గురైనా పట్టించుకోవడం లేదని భక్తులు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో మున్సిపల్, ఆలయ అధికారులు ఆ స్థలాన్ని పరిశీలించి ఆక్రమణలు జరిగినట్లు నిర్ధారించారు. త్వరలోనే సంబంధిత వ్యక్తులకు నోటీసులు ఇచ్చి ఆక్రమణలను తొలగిస్తామని అధికారులు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ కనకారావు పాల్గొన్నారు.

ఉల్లాసంగా...ఉత్సాహంగా..



పిఠాపురం పట్టణం నుంచి దెందులూరుకు బయలుదేరిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



సిద్ధం సభకు వెళ్లే ముందు మాట్లాడుతున్న దొరబాబు

- సిద్ధం బహిరంగ సభకు భారీగా తరలివెళ్లిన జనం
- గ్రామాల్లో జెండా ఊపి బస్సులను ప్రారంభించిన నాయకులు

సామర్లకోట/పిఠాపురం/కొత్తపల్లి: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి దెందులూరులో ఏర్పాటు చేసిన సిద్ధం సభకు ఊహించిన దాని కంటే అధికంగా జనం తరలివచ్చారని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు తెలిపారు. నియోజకవర్గ పరిధిలో వివిధ గ్రామాలు, మున్సిపాలిటీల నుంచి వచ్చిన బస్సులను పెద్దాపురం - రాజమహేంద్రవరంలోని ఏడీబీ రోడ్డులోని పాండవుల మెట్ట సమీపంలో ప్రారంభించారు. నియోజకవర్గానికి 78 బస్సులు కేటాయించగా గ్రామాల నుంచి అధిక సంఖ్యలో జనం సీఎం జగన్‌ను చూడటానికి సిద్ధం అయ్యారని, అయితే బస్సులు సరి పడకక పోవడంతో కొంత మందిని గ్రామాలలోనే వదలి వేయాల్సి వచ్చిందన్నారు. మూడు వేల మంది వస్తారని ఊహిస్తే నాలుగు వేలకు మించి జనం తరలి వచ్చారన్నారు. పేదలకు పెత్తందారులకు మధ్య జరిగే యుద్ధానికి అందరూ సిద్ధం కావలసిన తరుణం వచ్చిందన్నారు. నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీతో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తామనే ధీమాను దొరబాబు వ్యక్తం చేశారు. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన రాజప్ప నియోజకవర్గానికి చేసింది ఏమి లేదన్నారు. నియోజకవర్గం నుంచి తరలివెళ్లిన ప్రతి బస్సుకు ఒక నిర్వాహకుడిని అప్పగించి ఆ బస్సులో వారికి భోజన ఏర్పాట్లు చూసేందుకు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఏ బస్సులో వచ్చారో అదే బస్సులో తిరిగి వెళ్లేలా నిర్వాహకుడి ఫోన్ నెంబరు ఇవ్వడం జరిగిందన్నారు.

పిఠాపురం నియోజకవర్గం నుంచి ఉరకలేస్తూ..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం ఏలూరు జిల్లా దెందులూరులో నిర్వహించిన సిద్ధం బహిరంగ సభకు పిఠాపురం నియోజకవర్గం నుంచి జనం భారీగా తరలివెళ్లారు. శనివారం ఉదయం కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత జెండా ఊపి బస్సులు, వాహనాలను ప్రారంభించగా వేలాదిగా వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు తరలివెళ్లారు. 50 బస్సులు, 50కి పైగా కార్లు, ఇతర వాహనాల్లో పిఠాపురం మున్సిపాలిటీ, మండలం, గొల్లప్రోలు నగర పంచాయతీ, మండలం, కొత్తపల్లి మండలాల నుంచి పార్టీ శ్రేణులు, ప్రజలు సీఎం వైఎస్ జగన్ వెంటే మేము అని నినాదాలు చేస్తూ పార్టీ జెండాలు చేతబూని దెందులూరుకు బయలుదేరి వెళ్లారు. ఆయా గ్రామాల్లో బస్సులకు స్థానిక నేతలు జెండాలు ఊపి ప్రారంభించారు. సిద్ధం బహిరంగ సభకు స్వచ్ఛందంగా వేలాది మంది జనం వెళ్లడంతో వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో ఉత్సాహం ఉరకలు వేసింది.



కొత్తపల్లి మండలం నుంచి బయలుదేరిన వైఎస్సార్ సీపీ నాయకులు

అలాగే దెందులూరులో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శనివారం నిర్వహించిన సిద్ధం బహిరంగ సభకు కొత్తపల్లి మండలం భారీగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. దెందులూరుకు వెళ్లిన వారిలో పార్టీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, ఎస్సీ, ఎస్టీ డివిజన్ కమిటీ సభ్యుడు బండి దావీదు, వైస్ ఎంపీపీలు మాదిరెడ్డి దొరబాబు, చెట్టుబత్తిని సురేష్‌కుమార్, కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు ఉన్నారు.



గొల్లప్రోలు నగర పంచాయతీ నుంచి బయలుదేరిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



చేబ్రోలు నుంచి దెందులూరు వెళుతున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

ఖైదీల్లో పరివర్తన అవసరం

- సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూష కుమారి

పెద్దాపురం: నేరాలు చేసి శిక్ష అనుభవిస్తున్న ఖైదీల్లో పరివర్తన ఎంతో అవసరమని రాజమహేంద్రవరం సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూష కుమారి అన్నారు. శనివారం పెద్దాపురం సబ్ జైలులోని ముద్దాయిలకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆమె ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేరాలు చేసి శిక్ష అనుభవించిన తరువాత మళ్లీ నేరాలకు పాల్పడడం తగదన్నారు. అటువంటి వారికి శిక్ష మరింత కఠినంగా ఉంటుందని, ఖైదీలు పరివర్తన చెందాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం ముద్దాయిలకు అందుతున్న భోజన వసతి సౌకర్యాలను ఆమె పరిశీలించారు. ఆమె వెంట మానవ హక్కుల సంఘం నాయకులు నూతలపాటి అప్పలకొండ, జైలు సిబ్బంది ఉన్నారు.



సబ్‌జైలులో అందుతున్న సౌకర్యాలను పరిశీలిస్తున్న జడ్జి ప్రత్యూష కుమారి

నవోదయలో వసతుల తనిఖీ

స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో శనివారం తూర్పుగోదావరి జిల్లా జడ్జి ప్రత్యూషకుమారి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. విద్యాలయలో అందుతున్న సేవలపై ఆరా తీశారు. విద్యార్థులకు అందిస్తున్న బోధన, శిక్షణ ప్రణాళికా అంశాలపై ప్రిన్సిపాల్ కమలంను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణ, ఆటస్థలం, డార్మిటరీ, భోజనశాల, వంటశాలను పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

పిఠాపురం: వసతి గృహాల్లో వసతులు కల్పించడంతో పాటు విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని 12వ అదనపు జిల్లా జడ్జి ఎ.వాసంతి సూచించారు. పిఠాపురంలోని బీసీ వసతి గృహాన్ని ఆమె శనివారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థుల చదువుపై అధికారులను ఆరా తీశారు. హాస్టల్‌లో విద్యార్థులు చదువుపై పెద్దగా శ్రద్ధం చూపడం లేదన్న విషయంపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఆమె వసతి గృహ సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. ఉదయం, సాయంత్రం, ఖాళీ సమయాల్లో విద్యార్థులు చదువు పట్ల శ్రద్ధ వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు పెడుతున్న ఆహారం రుచి చూశారు. ఆహారం మరింత రుచికరంగా ఉండేలా చూడాలన్నారు. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని వార్డెన్ లతామోహన్‌కు సూచించారు.ఆమె వెంట న్యాయవాది ఎస్‌కే అబ్రహర్ష తదితరులు ఉన్నారు.



పిఠాపురంలో హాస్టల్ విద్యార్థులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి వాసంతి

జగనన్న గోరుముద్ద తనిఖీ

సామర్లకోట: మండలంలోని వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద పథకాన్ని ఎంఈఓ 2 పి.పుల్లయ్య శనివారం తనిఖీ చేశారు. మాధవపట్నం జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. అనంతరం విద్యార్థుల నుంచి గోరుమద్ద పథకంపై అభిప్రాయాలు సేకరించారు. పదో తరగతిలో మంచి ఉత్తీర్ణత సాధించేలా చూడాలని హెచ్‌ఎం ఎల్.గోవింద రాజుకు సూచించారు.



మాధవపట్నంలో గోరుముద్దను పరిశీలించిన ఎంఈఓ పుల్లయ్య

శృంగార వల్లభుని ఆలయం కిటకిట

పెద్దాపురం: మండలంలోని శృంగారవల్లభ స్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. వేకువ జాము నుంచి వందల సంఖ్యలో భక్తులు తరలిరావడంతో గంటల తరబడి భక్తులు క్యూలోనే నిరీక్షించాల్సి వచ్చింది. ఆలయ చైర్మన్ కర్రి జగదీష్, జిల్లా దేవదాయ శాఖ కమిషనర్, ఇన్‌చార్జి ఆలయ ఈఓ పులి నారాయణమూర్తి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు స్వామిని అలంకరించి, భక్తులకు ఆశీర్వచనాలు అందించారు. అన్నదానం, విరాళాలు, దర్శనం, కేశఖండన టిక్కెట్ల ద్వారా శనివారం సుమారు 3,02,286 రూపాయల ఆదాయం సమకూరినట్లు ఈఓ నారాయణమూర్తి, తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు, ఆలయ సిబ్బంది హాజరు కాగా సుమారు 15 వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.



భక్తుల నుంచి పూజలందుకుంటున్న తిరుపతి శృంగారవల్లభ స్వామి

భీమేశ్వరాలయ ట్రస్టు బోర్డుకు దరఖాస్తుల స్వీకరణ

సామర్లకోట: స్థానిక బాలాత్రిపురం సుందరి సమేత కుమారా రామ భీమేశ్వర ఆలయంలో ట్రస్టు బోర్డు సభ్యుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఈఓ డి.నాగమల్లేశ్వర రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎం.విజయరాజు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. దేవదాయ శాఖ నిబంధనలకు లోబడి ఆలయంలో సేవ చేయాలనే ఆలోచన ఉన్న వారు ట్రస్టు బోర్డులో సభ్యత్వానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 22వ తేది లోపుగా దరఖాస్తులను కాకినాడ లోని డిప్యూటీ కమిషనర్ కార్యాలయం లేదా విజయవాడలోని దేవదాయశాఖ కమిషనర్ కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాలని ఈఓ సూచించారు.

పాదగయ పాలక మండలి నియామకానికి...

పిఠాపురం: పిఠాపురంలో ప్రముఖ శైవ క్షేత్రమైన పాదగయ కుక్కుటేశ్వర స్వామి ఆలయానికి పాలక మండలి నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఆలయ ఈఓ వి.శ్రీనివాసరావు శనివారం తెలిపారు. పాలక మండలి సభ్యుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన వారు దరఖాస్తులను పూర్తి చేసి 20 రోజుల లోపు కాకినాడ దేవదాయశాఖ ఉప కమిషనర్ కార్యాలయంలో అందజేయాలని కోరారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఆలయ పాలక మండలి సభ్యులను నియమిస్తామన్నారు. మరిన్ని వివరాలకు ఆలయ పని వేళల్లో అధికారులను సంప్రదించాలన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కొత్తపల్లి: చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు స్థానిక పోలీసులు శనివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే...మండలంలోని పొన్నాడ శివారు కోనపాపపేటకు చెందిన యువకుడు తిత్తి నాగబాబు (23) జనవరి 30న ఉప్పాడ వైపు బీచ్ రోడ్డులో నడిచి వస్తుండగా రామన్నపాలెం వంతెన సమీపంలో మోటార్ సైకిల్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నాగబాబును చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్థానిక ఎస్సై స్వామినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రంకెలేస్తూ పోటీకి సై

- నేడు రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పోటీలు
- వివిధ జిల్లాల నుంచి 50 జతల ఎడ్లు రాక
- సీనియర్, జూనియర్ విభాగాల్లో పందేలు



పరుగు పోటీలకు సిద్ధంగా ఉన్న ఎడ్లు

సామర్లకోట: స్థానిక ఉండూరు రైల్వే గేటు ఎస్‌ఎఫ్‌సీఎల్ రోడ్డులో ఆదివారం ఉదయం రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శన నిర్వహిస్తున్నారు. శ్రీభీమేశ్వర ఎడ్ల పరుగు ప్రదర్శన సంఘం ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన జరుగుతుంది. ఈ ప్రదర్శనలో సీనియర్, జూనియర్ విభాగాలలో ఎడ్ల బళ్లు పాల్గొంటాయి. ఈ ప్రదర్శనకు సహాయం అందిస్తున్న చంద్రమౌళి చారిటబుల్ ట్రస్టు అధినేత గుణ్ణం చంద్రమౌళి, మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ చందలాడ అనంతపద్మనాభం పారిశ్రామిక వేత్త చందలాడ బాబ్జీ పాల్గొంటారని కమిటీ నాయకులు కొండపల్లి శ్రీనివాసు, బిక్కిన రంగనాయకులు, కాటూరి జానికిరామ్, పైబి గౌరీచంద్, చిట్టియ్యలు శనివారం స్థానిక విలేకర్ల సమావేశంలో తెలిపారు. సీనియర్ విభాగంలో ఎడ్లు 1500 మీటర్లు, జూనియర్ విభాగంలో ఎడ్లు వెయ్యి మీటర్లు వెళ్లి రావలసి ఉంటుందన్నారు. విజేతలకు సీనియర్ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, జూనియర్ విభాగంలో ఐదు బహుమతులతో పాటు, ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నారు. విశాఖపట్నం నుంచి ఏలూరు వరకు సీనియర్ విభాగంలో 10 జతలు, జూనియర్ విభాగంలో 35 జతల ఎడ్లు పాల్గొంటున్నట్లు తెలిపారు. పోటీలకు హాజరైన ఎడ్ల బండ్ల యజమానుల సమక్షంలో డ్రా తీసి సీరియల్ ప్రకారం ప్రదర్శనకు అనుమతి ఇస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే వారికి వసతి, భోజన సదుపాయాలను నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా కొండపల్లి శ్రీను, పీఈటీలు వీరబాబు, కోట్ని శ్రీను వ్యవహరిస్తారు. పోటీలకు ఎక్కువ ఎడ్లు రావడంతో ఉదయమే ప్రదర్శన పోటీలు ప్రారంభం అవుతాయని నిర్వాహకులు తెలిపారు. రైతు సంఘ నాయకులు, నిర్వాహకులు పోటీలకు ఏర్పాట్లు పూర్తి చేశారు.



ఎడ్లకు మసాజ్ చేస్తున్న రైతులు

ఏర్పాట్లు పూర్తి చేశాం



రాష్ట్ర స్థాయిలో జరిగే ఎడ్ల పరుగు పోటీలకు ఏర్పాట్లు పూర్తి చేశాం.1992 నుంచి శ్రీభీమేశ్వర రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పోటీలు నిర్వహిస్తున్నాం. అంతరించిపోతున్న ఎడ్ల బళ్ల పోటీలను ప్రోత్సహించడానికి తరుచూ ఇటువంటి పోటీలు నిర్వహిస్తున్నాం.

– కొండపల్లి శ్రీనివాసు, న్యాయ నిర్ణేత, సామర్లకోట

వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం

సామర్లకోట: స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో శనివారం వినియోగదారుల క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్‌ఎం తోటకూర సాయి శివరామకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ వై శివరామకృష్ణయ్య హాజరై వినియోగదారుల హక్కులపై అవగాహన ఉంటే మోసాల బారిన పడకుండా నాణ్యమైన వస్తు సేవలు పొందవచ్చని పేర్కొన్నారు. పెద్దాపురం డివిజన్ వినియోగదారుల ఫోరం కన్వీనర్ బి.సూర్యనారాయణ మూర్తి, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టరు వి.మోహన్ విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు ముఖ్య అతిథులు బహుమతులు అందజేశారు. క్లబ్ కన్వీనర్ జి.గోవిందు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.